క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఆరాధన



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక శ్రీకాశిరెడ్డినాయన ఆశ్రమంలో సోమవారం శ్రీ అవధూత కాశిరెడ్డినాయన గురువు అతిరాజ స్వామి ఆరాధన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అతిరాజస్వామి, కాశిరెడ్డినాయన ఆకుల భవనాశి గంగమ్మ అవ్వ చిత్రపటాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సామూహిక విష్ణుసహస్ర నామావళి నిర్వహించి స్వామి వారికి మహానైవేద్యం సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చారు. యథావిధిగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదపండితులు సుబ్బాశాస్త్రి, ఆదిశేషు, నాగరాజుశర్మ, ఆశ్రమ గౌరవ చైర్మన్ డాక్టర్ గోపాల్‌రెడ్డి, చక్రపాణి, నాగేశ్వరరెడ్డి, డాక్టర్ కార్తికమ్మ పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

నంద్యాల(సిటీ): మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకదాసు తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 5 వినతులు వచ్చాయి. ఆయన మాట్లాడుతూ స్పందన సమస్యలకు సంబంధించి రెండు ఇంటి నంబర్లు మార్చాలని, శానిటేషన్ ఒకటి, టిడ్కో, నీటి సమస్యలు పరిష్కరించాలని అందజేశారని చెప్పారు. వాటిని సంబంధిత సచివాలయ సెక్రటరీల సమన్వయంతో వెంటనే పరిష్కరించామన్నారు.

నేటి నుంచి వార్షికోత్సవ వేడుకలు



వేడుకలకు ముస్తాబైన ఆలయం



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

రుద్రవరం: మండలంలోని వెలగలపల్లె పాలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి, మహా త్రిపుర సుందరి సమేత మానస లింగేశ్వరస్వామి ఆలయాల్లో మంగళవారం నుంచి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, రంగనాయకులు, నరసింహులు సోమవారం తెలిపారు. 9, 10 తేదీల్లో ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు, కోలాటం, స్వామి వారి ప్రవచనాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కల్యాణోత్సవంలో పాల్గొన దలచిన భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించడంతో పాటు రుసుము చెల్లించాలని పేర్కొన్నారు.

సమ్మర్ క్యాంప్‌ను వినియోగించుకోండి

శిరివెళ్ల: వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్డీ సాల్మన్‌రాజు తెలిపారు. సోమవారం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కథల పుస్తకాలు, ఆటలు, నీతి కథలు, వార్తా పత్రికల చదవడం, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పిస్తారన్నారు. రిటైర్డ్ ఎంఈఓ మహబూబ్‌బాషా గ్రంథాలయ శాశ్వత భవన నిర్మాణానికి రూ.10 వేలు ప్రకటించారు. లైబ్రేరియన్ సుజాత పాల్గొన్నారు.

స్పందనపై నిర్లక్ష్యం తగదు



ఉయ్యాలవాడ రెవెన్యూ కార్యాలయంలో స్పందనకు హాజరైన అధికారులు

ఉయ్యాలవాడ : స్పందన కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదని తహసీల్దార్ రవికుమార్ సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి పలు శాఖల అధికారులకు ఎన్నిసార్లు నివేదికలు పంపినా గైర్హాజరవుతున్నారని వారిపై కలెక్టర్‌కు నివేదికలు పంపనున్నట్లు చెప్పారు. ట్రాన్స్‌కో, హౌసింగ్, పశు వైద్యం, మైనర్ ఇరిగేషన్, విద్య, ఆర్‌టీసీ, ఆర్ అండ్‌బీ, ఉపాధి, వ్యవసాయం, పెద్దయమ్మనూరు, మాయలూరు పీహెచ్‌సీల వైద్యాధికారులు కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రామకృష్ణారెడ్డి, ఫణీత్ కృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీశైలజ, ఏపీఎం శేఖర్ హాజరయ్యారు.

శిరివెళ్ల ఎస్‌ఐగా సురేష్

శిరివెళ్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఎస్‌ఐగా డోన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న బి.సురేష్‌ను నియమించారు. ఇక్కడ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డిని రుద్రవరానికి అటాచ్ చేశారు. ఈ మేరకు ఎస్పీ రఘువీర్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వేసవి నేస్తం కాటన్

- నూలు వస్త్రాలతో వేడి నుంచి ఉపశమనం
- అందం, ఆకర్షణతో పాటు హుందా..
- చల్లదనం కోసం ఆసక్తి చూపుతున్న ప్రజలు
- గిరాకీ పెరిగిందంటున్న వ్యాపారులు
- ఆధునిక డిజైన్లలో చీరలు



అమ్మకానికి ఉంచిన కాటన్ దుస్తులు

నంద్యాల(వ్యవసాయం): భానుడు భగభగ మండుతున్నాడు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. దీనికి తోడు ఉక్కపోతకు బయటకు వచ్చేందుకు జనం భయపడుతున్నారు. వేసవి ఎండల తీవ్రతను తగ్గించుకొనేందుకు జనం వివిధరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా వస్త్రధారణపై వేసవి ఎండ, ఉష్ణోగ్రత ప్రభావం చూపుతుంది. దీంతో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు కాటన్ దుస్తులపై ఆసక్తి చూపుతున్నారు. శరీరానికి హాయినివ్వడంతో పాటు చెమటను పీల్చుకొనే గుణం ఉంటుండటంతో ఎక్కువగా వీటినే ధరించేందుకు మక్కువ చూపుతున్నారు. అందం, ఆకర్షణతో పాటు హుందాని పెంచే కాటన్ ఖాదీ వస్త్రాలకు మార్కెట్లో డిమాండ్ పెరిగింది. చాలా మంది తెల్లని వస్త్రాలపై మక్కువ చూపుతున్నారు. హుందాతనంతో పాటు వేడిని గ్రహించకపోతుండటంతో చల్లదనాన్ని ఇస్తాయని పలువురు పేర్కొంటున్నారు.

ఆధునిక డిజైన్లలో..

నేటి ఫ్యాషన్లకు అనుగుణంగా ఆధునిక డిజైన్లలో అనేక రకాల కాటన్ వస్త్రాలు, చీరలు లభిస్తున్నాయి. పిల్లలు, యువత ఎక్కువగా కాటన్ దుస్తులు, పెద్దలు ఖాదీ వస్త్రాలు, మహిళలు కాటన్ చీరలు వినియోగిస్తుండటంతో బ్రాండెడ్, సాధారణ దుకాణాలతో పాటు నగరంలోని రోడ్లపై కూడా వ్యాపారులు అమ్మకాలు జరుపుతున్నారు. రాత్రి వేళ పిల్లలు ధరించే కాటన్ నైట్ డ్రస్సులు, నైట్ ప్యాంట్లు అమ్మకాలు రెండింతలయ్యాయని వ్యాపారుతు చెబుతున్నారు. పేద, మధ్యతరగతి వర్గాలకు కావాల్సిన ధరలకు అనుగుణంగా ప్రత్యేక ఆకర్షణీయమైన డిజైన్లతో మార్కెట్‌లో కాటన్ దుస్తులు లభ్యమవుతున్నాయి.



కాటన్ దుస్తులు కొంటున్న దృశ్యం

కాటన్ ధరించడం మంచిది



వేసవిలో శరీరం వేడి నుంచి తట్టుకోవడానికి పలు జాగ్రత్తలు తీసుకోవాలి. కాటన్ దుస్తులు ధరించడం ఎంతో ఉత్తమం. శరీరం చల్లగా ఉంటుంది. చర్మవ్యాధులను అరికట్టవచ్చు. బయటకు వెళ్లేటప్పుడు, ఇంట్లోనూ ధరిస్తే చాలా మంచిది.

– సాంబయ్య, నంద్యాల

అమ్మకాలు పెరిగాయి



వేసవి కావడంతో కాటన్ వస్త్రాల అమ్మకాలు బాగా పెరిగాయి. అన్ని రకాల కాటన్ దుస్తులు అందుబాటు ధరలో ఉన్నాయి. పిల్లల నుంచి పెద్దల వరకు అన్ని వర్గాల వారికి అవసరమైన రకాల రెడీమేడ్ దుస్తులు, మెటీరియల్ అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది కంటే ఈ సారి ఎక్కువ ఎండలు ఉండటం వల్ల కాటన్ వస్త్రాలను ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తుండటంతో అమ్మకాలు బాగా పెరిగాయి.

– సోమశేఖర్రెడ్డి, వ్యాపారి, నంద్యాల

ఎమ్మెల్యేను కలిసిన నూతన డీఎస్పీ



ఎమ్మెల్యే గంగులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ వెంకట్రామయ్య

ఆళ్లగడ్డ: ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని డీఎస్పీ వెంకట్రామయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఆళ్లగడ్డ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ సోమవారం ఎమ్మెల్యే కార్యాలయం చేరుకుని ఎమ్మెల్యేనుకలిసి నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు



గాయపడిన నరసింహ

ఆళ్లగడ్డ: చాగలమర్రి మండలం పెద్దబోధనం మెట్ట సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసింహ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. రాంపల్లె గ్రామానికి చెందిన నరసింహ మోటార్ సైకిల్‌పై చాగలమర్రి వైపు వెళ్తుండగా పెద్దబోధనం మెట్ట సమీపంలో కర్నూలు వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో నరసింహ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నంద్యాల వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చాగలమర్రి పోలీసులు తెలిపారు.

భక్తులకు అసౌకర్యం కలుగకుండా చూడాలి



కుంభాభిషేకం ఏర్పాట్లు పరిశీలిస్తున్న చైర్మన్

శ్రీశైలంటెంపుల్: క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూసుకోవాలని శ్రీశైలదేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీశైల దేవస్థానంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం పరిశీలించారు. క్షేత్రంలో మహాకుంభాభిషేకం కోసం ఏర్పాటు చేస్తున్న యాగశాల, గణేష సదనం క్యూలైన్లు, ఇంజినీరింగ్ పనులు, భద్రత, విరాళాల సేకరణ తదితర పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. క్యూలైన్లలో రద్దీకి అనుగుణంగా నిరంతరం మంచినీరు , అల్పాహారం, బిస్కెట్లు, అందిస్తుండాలని సూచించారు. దర్శనానికి పట్టే సమయాన్ని ఆలయ ప్రసార వ్యవస్థ ద్వారా నిరంతరం తెలియజేస్తూ ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం దేవస్థానం చేస్తున్న ఏర్పాట్లుపై భక్తులతో ముఖాముఖిగా సంభాషించారు. అలాగే దాతలకు విరాళాల పథకం గురించి స్పష్టంగా వివరించాలని, విరివిగా విరాళాలు అందించేలా ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ, నరసింహారెడ్డి, ఏఈఓ ఫణిదర ప్రసాద్, పర్యవేక్షలు అయ్యన్న, ఏఈ భవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం పంపిణీ



మహిళా రైతుకు చెక్కు అందజేస్తున్న రేంజి అధికారి

రుద్రవరం: రేంజి పరిధిలోని రుద్రవరం,ఆలమూరు గ్రామాలకు చెందిన పలువురు రైతులకు సోమవారం రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు పరిహారం చెక్కులు అందజేశారు. రుద్రవరం రేంజిలోని పలు గ్రామాల రైతులు రబీ సీజన్‌లో నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలోనున్న పొలాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. దిగుబడులు చేతికొచ్చే సమయంలో అడవి జంతువులు దాడి చేసి పంటను ధ్వంసం చేసి రైతులకు నష్టం కలిగించాయి. తమకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు అటవీ శాఖ అధికారులకు దరఖాస్తులు చేసుకోగా.. ఉన్నతాధికారులు పరిశీలించి వాటికి సంబంధించి పరిహారం మంజూరు చేశారు. ఆయన మాట్లాడుతూ రుద్రవరం,ఆలమూరు గ్రామాలకు చెందిన ఏడుగురు రైతులకు రూ.58,140 మంజూరయ్యాయని చెప్పారు. ఆయా సెక్షన్ల ఫారెస్టర్లు నాగరాజు,ముక్తర్, సిబ్బంది ఉన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

ఆళ్లగడ్డ: మండల కేంద్రం చాగలమర్రికి చెందిన దూదేకుల మాబున్ని ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ తులసమ్మ, పంచాయతీ అధికారులు సోమవారం బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ. 10వేలు అందజేశారు. వారు మాట్లాడుతూ మిగిలిన మొత్తం నామిని ఖాతాలో జమవుతుందని చెప్పారు. వైస్ ఎంపీపీ రఫీ, ఈఓ సుదర్శనరావు ఉన్నారు.

తలసీమియాపై అవగాహన పెంచాలి



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): తలసీమియా వ్యాధి పట్ల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన పెంచాలని ఫెడరేషన్ ఆఫ్ గైనిక్ సొసైటీ ఆఫ్ ఇండియా(ఫాగ్సి) కర్నూలు ప్రెసిడెంట్ డాక్టర్ వెంకటరమణ, పీడియాట్రిక్స్ అసోసియేషన్ కర్నూలు అధ్యక్షులు డాక్టర్ విజయానందబాబు చెప్పారు. వరల్డ్ తలసీమియా డే సందర్భంగా సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనిక్ విభాగంలో గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలసీమియా జన్యుపరమైన వ్యాధి అని, దంపతులు వివాహానికి ముందే అవసరమైన పరీక్షలు చేయించుకుంటే మేలన్నారు. ఇందులో తలసీమియా క్యారియర్స్‌గా ఇద్దరూ ఉంటే వారికి జన్మించే పిల్లలకూ వ్యాధి వస్తుందన్నారు. ఇలాంటి వారు పెళ్లి చేసుకోకూడదన్నారు. అలాగే మేనరికపు వివాహాల వల్ల కూడా తలసీమియా వస్తుందని, మేనరికపు వివాహాలు చేసుకోకూడదని తెలిపారు. కార్యక్రమంలో గైనకాలజిస్టులు డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ ఎ.సుధారాణి, డాక్టర్ సుజాత, డాక్టర్ ప్రియాంక, పీడియాట్రిక్స్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రత్నాకర్‌రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు మరువలేనివి



అధికారులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేసీ నిశాంతి

నంద్యాల: జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు మరువలేనివని జాయింట్ కలెక్టర్ నిశాంతి పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ వరల్డ్ డే సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి జేసీ, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ముద్రించిన వడదెబ్బ, వడగాలులపై అవగాహన కార్యక్రమ కరపత్రాలను జాయింట్ కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఉచితంగా భోజనాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి, డీఆర్‌ఓ పుల్లయ్య, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, డీఈఓ అనురాధ, వైద్య విధాన పరిషత్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జఫరుల్లా, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు మద్దిలేటి పాల్గొన్నారు.

మైనార్టీలకు మేలు చేసింది వైఎస్సార్ కుటుంబమే

- టీడీపీ అధినేత చంద్రబాబు కరివేపాకులా వాడుకొని వదిలేశారు
- విలేకరుల సమావేశంలో మైనారిటీ సెల్ అధ్యక్షుడు యూనుస్



మాట్లాడుతున్న యూనుస్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్రంలో మైనార్టీలకు మేలు చేసింది.. చేస్తున్నది వైఎస్సార్ కుటుంబమే అని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు యూనుస్ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్న టీడీపీ నేత లోకేష్ కర్నూలులో ఏర్పాటు చేసిన మైనార్టీ సమావేశం డ్రామా సెట్టింగ్‌లా ఉందన్నారు. రాజకీయ లబ్ధి కోసం మైనార్టీలకు ఏదో చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. ముస్లింలకు మేలు చేయడంలో వైఎస్సార్ కుటుంబం తరువాతే మిగితా వారన్నారు. నాడు మహానేత వైఎస్సార్ ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్లు మైనార్టీల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చాయన్నారు. ఆయన తనయుడు సీఎం జగన్ తమకు ఎంతో చేస్తున్నారని, గత ఎన్నికల్లో ఐదుగురికి అసెంబ్లీ టికెట్లు ఇవ్వడంతో పాటు నలుగురికి ఎమ్మెల్సీ పదవులు, ఒకరికి డిప్యూటీ సీఎం, మరొకరికి మండలిలో డిప్యూటీ చైర్మన్‌గా అవకాశం కల్పించారన్నారు. ఇలా ఎన్నో పదవులు కట్టబెట్టి రాజకీయంగా ముస్లింలకు గుర్తింపు కల్పించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. తమ అధినేత వైఎస్ జగన్ కడపలో సొంత మామ రవీంద్రారెడ్డిని కాదని మైనార్టీ అయిన అంజాద్ బాషాకు టికెట్ ఇచ్చారని, అదే టీడీపీ అధినేత చంద్రబాబు హిందూపురంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గనీని పక్కన పెట్టి ఆయన బావమరిది బాలకృష్ణకు ఇచ్చుకున్నారన్నారు. దీని బట్టి మైనారిటీలపై ఎవరికి ప్రేమ ఉందో స్పష్టమవుతుందని తెలిపారు. 2014 ఎన్నికల్లో గెలుపు కోసం చంద్రబాబు మైనార్టీలకు వివిధ హామీలు ఇచ్చి ఆ తర్వాత మోసం చేశారన్నారు. జనాభా దమాషా ప్రకారం ముస్లింలకు సీట్లు ఇస్తామని లోకేష్ చెప్పడం కాదని, ఆ సీట్లు ఎక్కడ ఇస్తున్నారో ముందుగా తేల్చాలన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ పాదయాత్రలో ఎమ్మెల్యేలపై తప్పుడు ఆరోపణలు చేయడం లోకేష్‌కు తగదని, నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. రాష్ట్రమంతా తిరిగే బదులు ముందు పోటీ చేసే నియోజకవర్గం ఎంచుకుని అక్కడ చేయాలని, లేదంటే పాణ్యంలో కాటసానిపై పోటీ చేసి గెలవాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు చందు, సొహెల్ పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి భీమవరానికి చెందిన రామచంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కార్యాలయంలో జిల్లా నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా నంద్యాల జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు హేమసుందర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి ఆయనకు నియామక పత్రాలు అందజేశారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తూము శివారెడ్డి, కృష్ణారెడ్డి, పుల్లన్న పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణ తరగతులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మున్సిపల్ టౌన్ పార్కు, ఆయుష్ యోగా కేంద్రంలో ఈనెల 10వ తేదీ నుంచి బాలల వ్యక్తిత్వ వికాస యోగా శిక్షణ తరగతులను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రముఖ యోగా గురువు కండే ఆనంద్ గురుజీ సోమవారం తెలిపారు. ఉదయం 6 నుంచి 7.45గంటల వరకు బాలబాలికలకు సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ఆసనాలు, ధ్యానం, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. వివరాలకు సెల్ 9989983673 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రాహుకేతు పూజలకు సర్వం సిద్ధం



మహానందిలో ప్రతిష్ఠించనున్న రాహుకేతు విగ్రహాలు

మహానంది: రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతూ స్వయంభువుగా వెలిసిన శ్రీ మహానందీశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 10వ తేదీ నుంచి రాహుకేతు పూజలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఇప్పటికే దాతల సహకారంతో రాహుకేతు పూజలకు అవసరమైన మండపాన్ని సుందరంగా నిర్మించారు. దీంతో పాటు ప్రత్యేకంగా తయారు చేయించిన రాహుకేతు విగ్రహాలను తెప్పించారు. విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాన్ని ఈ నెల పదవ తేదీ నుంచి చేపట్టనున్నట్లు వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. మహానందీశ్వరస్వామి పుట్టలో నుంచి స్వయంగా ఉద్భవించిన క్షేత్రమైన మహానందిలో చేయించుకునే రాహుకేతు పూజలకు శీఘ్ర ఫలితం వస్తుందని చెప్పారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నట్లు వివరించారు.

స్టీల్ గ్లాసులు సరఫరా



ఎమ్మార్సీ కార్యాలయానికి చేరిన బకెట్లు, గ్లాసులు

ఉయ్యాలవాడ: జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేసేందుకు విద్యార్థులకు ప్రభుత్వం స్టీల్ గ్లాసులను సరఫరా చేసింది. మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, మోడల్‌స్కూల్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల కోసం 2,125 బకెట్లు, గ్లాసులు ప్రభుత్వం సరఫరా చేసినట్లు ఎంఈఓ అనురాధ తెలిపారు. ఆయా పాఠశాలలకు చేరవేసి ప్రారంభం రోజున విద్యా కానుకతో పాటు గ్లాసులను కూడా అందజేయనున్నట్లు తెలిపారు.

మహానందిలో భక్తజన సందడి

మహానంది: వేసవి సెలవులకు తోడు మహానందీశ్వరస్వామి వారికి ప్రీతికరమైన సోమవారం ఆలయంలో భక్తజనసందడి నెలకొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఈ నెలలో రద్దీ నేపథ్యంలో నెలరోజుల పాటు నిర్విరామంగా దర్శన సౌకర్యం ఉంటుందని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

గ్యాస్ ధర తగ్గించాలి

నంద్యాల(అర్బన్): వంట గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నారాయణమ్మ కోరారు. సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గ్యాస్ సిలిండర్ ధర పెంపును నిరసిస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జాయింట్ కలెక్టర్ నిశాంతికి అందజేశారు. అనంతరం నారాయణమ్మ మాట్లాడుతూ రాజస్థాన్ ప్రభుత్వం వినియోగదారులకు ఇస్తున్న తరహాలోనే వంట గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే మన రాష్ట్రంలో కూడా ఇవ్వాలన్నారు. లక్ష్మిదేవి, మహేశ్వరి, పెద్దక్క, సుభద్ర, రామసుబ్బమ్మ, హిమబిందు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీ చోరీ

ఉయ్యాలవాడ: మండలంలోని సర్వాయపల్లె గ్రామానికి చెందిన ఎద్దుల వెంకటేశ్వర్లు అనే రైతుకు చెందిన ట్రాక్టర్ ట్రాలీ గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకొని పోయారని రైతు పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు ఈనెల 2న గ్రామం శివారులోనున్న కల్లంలో ట్రాక్టర్ ట్రాలీని ఉంచారు. మరుసటి రోజు ట్రాక్టర్ ట్రాలీ కోసం వెళ్లగా కనిపించకపోవడంతో గ్రామంలో విచారించినా ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేశాడు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నేడు సుద్దమల్లలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్ శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వైద్యాధికారి రమేష్‌చంద్ర బాలాజీ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి వైద్య బృందం ఉదయం 9 గంటలకు చేరుకుని సాయంత్రం 4 గంటల వరకు గ్రామంలోని ప్రజలకు వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాన్యం కౌలుకు వేలం



వేలంలో పాల్గొన్న అధికారులు, రైతులు

దొర్నిపాడు: మండలంలోని కొండాపురం గ్రామ సిద్దేశ్వరస్వామి మాన్యం కౌలుకు ఈఓ చంద్రుడు ఆధ్వర్యంలో సోమవారం వేలం నిర్వహించారు. సిద్దేశ్వరం ఆలయానికి చెందిన 28ఎకరాల కౌలుకు వేటం నిర్వహించగా రూ.5.81లక్షలకు రైతులు దక్కించుకున్నారు. గత ఏడాది రూ.3.55 లక్షలకు పలికిందని ఈఓ తెలిపారు. సర్వే నంబర్ 2, 6కు సంబంధించిన భూముల వేలం వాయిదా వేసినట్లు చెప్పారు. ఆలయ పైభాగం పెచ్చులు ఊడుతుందని, మరమ్మతులు చేయించాలని శివారెడ్డి ఈఓకు సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు డీలర్ శివుడు, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

17నుంచి మాన్యం కౌలుకు వేలం

శిరివెళ్ల: మండలంలోని వివిధ ఆలయాల మాన్యం కౌలుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కోటపాడు దేవస్థానం గ్రూప్ ఈఓ వేణునాథరెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 17వ తేదీన బోయలకుంట్లలోని శ్రీరామేశ్వర, వీరభద్ర స్వామి ఆలయాలకు చెందిన 25.26 ఎకరాలు, శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయానికి చెందిన 11.62 ఎకరాలు, ఆంజనేయ స్వామి దేవస్థానికి చెందిన 11.43 ఎకరాలు, వేణుగోపాలస్వామి ఆలయం 11.44 ఎకరాలు, నరసింహాస్వామి ఆలయం 5.94 ఎకరాలు, కామినేనిపల్లెని శ్రీ ఈశ్వర, ఆంజనేయ స్వామి ఆలయాలకు చెందిన 31.06 ఎకరాల మాన్యం కౌలుకు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. అలాగే 18న చెన్నూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన 20.42 ఎకరాలకు వేలం పాటలు ఉంటాయని వివరించారు.

సూక్ష్మ సేద్యానికి అధిక ప్రాధాన్యత



అరటి పంటను పరిశీలిస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): జిల్లాలో ఉద్యానవన పథకాల్లో సూక్ష్మ సేద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ వైవీఎస్ ప్రసాద్ తెలిపారు. సూక్ష్మ సేద్యానికి సంబంధించిన పంటల సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు జిల్లాకు వచ్చిన ఆయన సోమవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో అరటి పంటను పరిశీలించారు. అనంతరం స్థానిక కార్యాలయంలో 13 కంపెనీలకు చెందిన ప్రతినిధులు, అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూక్ష్మ సేద్యం చేస్తున్న ప్రతి రైతుకు డ్రిప్, స్ప్రింక్లర్లను ఈనెల 15వ తేదీలోపు అందజేయాలన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఇచ్చిన మొత్తం టార్గెట్ త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఆర్‌బీకేల వారీగా సూక్ష్మ సేద్యానికి సంబంధించిన ప్రణాళికలు తయారు చేసి అమలు చేయాలని ఆదేశించారు.ఏపీఎంఐపీ పీడీ సత్యనారాయణ, ఎంఐ ఇంజినీర్లు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



రాజేశ్వరిని సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పదో తరగతిలో 583 మార్కులు సాధించిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని రాజేశ్వరిని ఏపీ రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆల్వ కొండ మద్దిలేటి ఆధ్వర్యంలో స్థానిక పాఠశాల ఆవరణలో సన్మానించారు. మద్దిలేటి మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టినప్పటికీ, తల్లిదండ్రుల కష్టానికి ఉత్తమ మార్కులు సాధించి ఫలితం చూపించిందని అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాక్షించారు.నాయకులు నాగరాజు, విశ్వనగర్ రాము, ఆంజనేయులు, సురేంద్ర పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేయించుకోండి

ఉయ్యాలవాడ : త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్‌లో చిరుధాన్యాల సాగు చేసే రైతులు విత్తనాల కోసం తమ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోని పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చిరుధాన్యాల సాగు కోసం ప్రోత్సాహకాలను అందిస్తోందని, కొర్ర, సజ్జ, నువ్వులు, రాగులు, తదితర విత్తనాల కోసం ఆర్‌బీకేల్లో సంప్రదించాలని కోరారు.